నవతెలంగాణ

1

ఆదిలాబాద్

సోమవారం | 26 ఆగస్టు, 2024 | www.navatelangana.com

సెప్టెంబర్ ఒకటిన విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలి

నవతెలంగాణ-రెబ్బెన

ముప్పై ఏండ్ల కళ నేరవేరిన సందర్భంగా మండల కేంద్రాల్లో సెప్టెంబర్ ఒకటిన వర్గీకరణ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని రెబ్బెన, తిర్యాణి, వాంకిడి జైనూర్, సిర్పూర్(యు), నార్నూర్ మండలాల్లో వర్గీకరణ సాధన దండోరా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని తీర్మాణించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కోర్రాళ్ల రాజేందర్, గోగర్ల రాజేష్, బొంగు నర్సింగ్ రావు, గోగర్ల రాజేష్, రోడ్డ శంకర్, చిలుముల నరసింహులు, అర్కిల్ల స్వామి, గోగర్ల శ్రీనివాస్, ఇగురపు రమేష్, ఇగురపు రవీందర్, గోగర్ల శంకర్, గోగర్ల చంద్రకళ ఇగురపు భుజంగరావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్స్, ఓనర్స్‌కు అవగాహన

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని ఆటో ఓనర్స్, డ్రైవర్లకు సీఐ చిట్టిబాబు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చిట్టిబాబు మాట్లాడుతూ ఆటో డ్రైవర్స్ ఓనర్స్‌కు ఆటోకు నెంబర్ ప్లేట్స్, గుర్తింపు పత్రాలు కచ్చితంగా ఉండాలన్నారు. డ్రైవర్‌కు ఆటో ఇచ్చే క్రమంలో డ్రైవర్స్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేని డ్రైవర్స్‌కు ఎట్టి పరిస్థితుల్లో ఆటోలు ఇవ్వద్దన్నారు. ఓవర్టేక్ చేయకుండా నెమ్మదిగా నడపాలని సూచించారు. సరైన గుర్తింపు లేని ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆటోలో నలుగురిని మాత్రమే తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమం ఎస్సై చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల విహారం.. జ్వరాలు తీవ్రం..!

● పల్లెల్లో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యం ● ఇంటింట జ్వర సర్వే నిర్వహిస్తున్న వైద్యశాఖ ● ఈ ఒక్క నెలలోనే 2650మంది బాధితులు
● జిల్లావాసులను కలవరపెడుతున్న డెంగ్యూ జ్వరాలు ● యంత్రాంగం దృష్టిసారిస్తేనే నివారణ సాధ్యం

దోమల స్వైర విహారం..వివిధ రకాల జ్వరాలకు కారణమవుతోంది. పల్లెల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారడం.. వాతావరణ మార్పుల కారణంగా జ్వర బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇంటికొకరు చొప్పున వివిధ రకాల జ్వరాలతో బాధపడుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. పరిసరాల అపరిశుభ్రత, శుద్ధనీరు లభించకపోవడం, నీటి నిల్వ ప్రాంతాలు ఉండటం మూలంగా దోమల సంఖ్య విచ్చలవిడిగా వృద్ధి చెందేందుకు కారణమవుతోంది. పచ్చదనం-సచ్ఛదనం పేరిట పంచాయతీల్లో ఇటీవల పారిశుధ్య చర్యలు చేపట్టినా.. పూర్తిగా సత్ఫలితాలివ్వన్నట్లు విమర్శలు ఉన్నాయి. పాలకవర్గాలు లేకపోవడం.. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడం కారణంగా పంచాయతీలు అపరిశుభ్రంగా మారుతున్నాయనే ఆరోపణలున్నాయి. మరోపక్క వైద్యశాఖ ఆగస్టు 1వ తేదీ నుంచి చేపట్టిన జ్వర సర్వేలో ఇప్పటి వరకు 2650 మంది వివిధ రకాల జ్వరాలతో బాధపడినట్లు తేలింది. ఇందులో డెంగ్యూ కేసులు కూడా నమోదు కావడం జిల్లావాసులను కలవరానికి గురిచేస్తున్నాయి.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో ఏటా వర్షాకాలం రాగానే జ్వరాలు ప్రబలడం సాధారణంగా మారుతోంది. గతంలో ఈ పరిస్థితి మరింత జఠిలంగా ఉండగా.. ప్రభుత్వాలు, పాలకవర్గాలు, అధికారుల చర్యల కారణంగా కొన్నేండ్ల నుంచి ఈ సమస్య చాలా వరకు తగ్గింది. కానీ పూర్తిగా నివారించడం సాధ్యం కావడం లేదు. జ్వరాలు ప్రబలడానికి ప్రధాన కారణం దోమల వృద్ధితో పాటు వాతావరణ మార్పులు, నీటి కాలుష్యమే కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం పల్లెల్లో పాలకవర్గాలు లేకపోవడం ఓ సమస్యగా మారుతోంది. ఇది వరకు ఆయా గ్రామాలకు సర్పంచ్‌లు ఉండగా..గ్రామాల్లో పరిసరాలు శుభ్రం చేయించడం, గడ్డి మొక్కలు తొలగించడం, దోమల మందు పిచికారి చేయించడం వంటి చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం వారు లేకపోవడం.. నిధులు లేకపోయినా సొంతంగా ఖర్చు చేసి నిధులు వచ్చిన తర్వాత తీసుకోవడం వంటివి చేపట్టేవారు. కానీ ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించినప్పటికీ నిధుల కొరత వేధిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులతో వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతుంటే..మరికొందరు బిల్లులు వస్తాయో రావో అనే సందేహంతో సొంత డబ్బులు వెచ్చించడం లేదని తెలుస్తోంది. మరోపక్క వారు చిరుద్యోగులు కావడం కూడా ఓ కారణంగా కనిపిస్తోంది. దీంతో దోమల వృద్ధి పెరిగిపోవడంతో పాటు నీటి కలుషితం కావడం, నీటి నిల్వ ప్రాంతాలపై దృష్టిసారించకపోవడం మూలంగా దోమల సంఖ్య పెరిగి మనుషుల ప్రాణాల మీదకు తీసుకొస్తున్నాయి.



2650మంది జ్వర బాధితులు..!

జిల్లాలో జ్వరాల తీవ్రత అధికం కావడంతో వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఈ నెల 1వ తేదీ నుంచి ఇంటింటి జ్వర సర్వేకు శ్రీకారం చుట్టింది. ఈ సర్వేలో 1008మంది ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి జ్వరాల వివరాలు నమోదు చేస్తున్నారు. ఒక్కో ఆశా కార్యకర్త కనీసం 25 ఇండ్ల చొప్పున వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. ఇప్పటి వరకు 2,35,365ఇండ్లను పరిశీలించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో ఈ నెల రోజులుగా 2650మంది మలేరియా, టైఫాయిడ్, వైరల్, అతిసారం, డెంగ్యూ తదితర జ్వరాలతో బాధపడినట్లు గుర్తించారు. రోజుకు కనీసం 170మంది వరకు వివిధ రకాల జ్వరాల బారినపడుతున్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా ఇప్పటి వరకు జిల్లాలో 90 వరకు డెంగ్యూ కేసులు నమోదు కావడం జనాల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ఇది వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన వాటినే అధికారులు వెల్లడించగా.. ఉన్నతాధికారుల చర్యల కారణంగా గత మూడు రోజులుగా ప్రయివేటు ఆస్పత్రులు సైతం డెంగ్యూ నిర్ధారణ చేయించేందుకు ఎలిసా టెస్టు కోసం శాంపిల్స్‌ను రిమ్స్‌కు పంపిస్తున్నాయి. ఫలితంగా డెంగ్యూ జ్వరాల నమోదు వివరాలు స్పష్టంగా తెలిసేందుకు అవకాశం లభిస్తోంది.



జ్వరాల నివారణకు చర్యలు

డా.శ్రీధర్, జిల్లా మలేరియా అధికారి, ఆదిలాబాద్



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో జ్వరాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఈ నెల నుంచి ఇంటింటి జ్వర సర్వేను చేపట్టాం. జ్వరాల తీవ్రత అధికంగా ఉన్న చోట్ల క్యాంపులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. మరోపక్క ప్రతి ఒక్కరు పరిసరాల శుభ్రతను పాటించాలి. నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

రోగులకు మెరుగైన వైద్యమందించాలి

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం రిమ్స్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న వైద్య సేవలపై రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అందించే భోజనాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని డైరెక్టర్‌కు సూచించారు. భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వైరల్ జ్వరాలు తీవ్రంగా విజృంభిస్తున్నాయని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు ఎస్సైగా అంజమ్మ

నవతెలంగాణ-తలమడుగు



తలమడుగు ఎస్సైగా అంజమ్మ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై తలమడుగు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఏఎస్సై కైసర్, పోలీస్ సిబ్బంది గోపాల్, ప్రహ్లాద్, సంతోష్, మధుకర్ స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛం అందజేశారు.

జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయం

నవతెలంగాణ-నిర్మల్



జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దీక్షా జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మెన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడారు. శ్రీ అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ వారు, ప్రసన్న హరికృష్ణ విన్నర్స్ వారి సహకారంతో నిర్మల్ జిల్లా కేంద్రంలో సుమారు యాభై ప్రముఖ కంపెనీలకు చెందిన 2వేలకు పైచిలుకు ఉద్యోగాలతో పదో తరగతి, నుంచి డిగ్రీతో పాటు బీటెక్, బీఫార్మసీ, పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులకు, ఉద్యోగాలు అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఇంటర్వ్యూ తదితర అంశాల్లో ఎంపికైన వారికి ఉచితంగా శిక్షణ కల్పించి, ప్లేస్మెంట్ అందించి, జాబ్ ఇవ్వడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అప్పాల ప్రభాకర్, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు పలిక శ్రీనివాస్, గురుస్వామి శనిగారపు చిన్నయ్య, కౌన్సిలర్ శ్రీధర్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తండ్రి మరణం తట్టుకోలేక కొడుకు గుండె పోటుతో మృతి

నవతెలంగాణ-నిర్మల్

తండ్రి మరణం తట్టుకోలేక కొడుకు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఆస్రా కాలనీకి చెందిన జుహార్ అలీ ఖాన్(74) ఆదివారం ఉదయం అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. తండ్రి మరణంతో తీవ్ర మనోవేదనకు గురైన తన కుమారుడు ఆవీద్ అలీఖాన్ (52) ఏడుస్తూ గుండెపోటుతో మృతి చెందాడు. గంటల వ్యవధిలోనే తండ్రీ, కొడుకులిద్దరూ మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

సభ్యత్వ నమోదు ప్రక్రియ పకడ్బంధీగా చేపట్టాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను పకడ్బంధీగా చేపట్టాలని ఆ పార్టీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గసభ్యులు గోలి మధుసూధన్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు నివాసంలో సభ్యత్వ నమోదు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఒకటి నుండి 30 వరకు సాధారణ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఉంటుందని, అక్టోబర్ నెలలో క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. నవంబర్ పదో తేదీ నాటికి జాతీయస్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ రెండు నెలల పాటు కొనసాగే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని సూచించారు. ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ బీజేపీ అని, ఈ పార్టీలో సభ్యత్వం తీసుకోవడం ప్రతి ఒక్కరికి గర్వకారణమవుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని దిశానిర్దేశం చేశారు. దీనికి ముందు పార్టీ నాయకులు మధుసూధన్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, నాయకులు సొల్లు లక్ష్మి, కొలిపాక కిరణ్, కృష్ణకుమారి మల్లిక్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే ఎస్పీఎం ముడిసరుకు వాహనాలు

● అవస్థలు పడుతున్న స్థానికులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లుకు ముడిసరుకు తీసుకువచ్చే వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తుండడంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానిక బీఎంఎస్ కార్యాలయం ముందు హనుమాన్ మందిర్ వైపు వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన భారీ వాహనాలను పదుల సంఖ్యలో నిలిపి ఉంచుతున్నారు. అసలే ఇరుకు రోడ్డు కావడం, భారీ వాహనాలు నిలిపి ఉంచడంతో ఇతర వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. అదేవిధంగా బీఎంఎస్ కార్యాలయం నుండి లారీ చౌక్ వెళ్లే రహదారిలో కూడా రోడ్డుకు ఒక పక్క మిల్లుకు ముడిసరుకు తీసుకువచ్చే భారీ వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం స్థానికులు అక్కడ ఉన్న మిల్లు ప్రతినిధిపై మండిపడ్డారు. ఇరుకు రోడ్డుపై లారీలను నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల క్రితం ఇదే విధంగా కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై రూరల్ పోలీసు స్టేషన్ వద్ద కూడా ఇదే విధంగా పదుల సంఖ్యలో భారీ లారీలను నిలిపి ఉంచారు. ద్విచక్ర వాహనదారుడు ఇక్కడ ప్రమాదానికి గురి కాగా స్పందించిన పోలీసులు వెంటనే ఆ లారీలను అక్కడి నుండి తరలించారు. ప్రమాదం జరిగితే తప్ప పోలీసులు స్పందించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.



పురుగులమందు తాగి ఇద్దరి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేర్వేరు కారణాలతో పురుగులమందు తాగి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు మండలంలో చోటు చేసుకున్నాయి. ఎస్ఐ రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. అంకుసాపూర్ గ్రామానికి చెందిన కవల్కర్ బాబురావు (42) కూలీ పనులకు వెళ్లేవాడు. కూలీ పనులు వద్దని వ్యవసాయ పనులకు రావాలని అనడంతో పనులకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి గూడేన్‌ఘాట్ సమీపంలో పురుగులమందు తాగినట్లు బంధువు గోవిందుకు తెలిపాడు. వెంటనే గోవిందు ఇంట్లో వారికి సమాచారం ఇవ్వగా బాబురావు కోసం గాలించగా అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మరణించాడు. మృతుడి కుమారుడు నిఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మరో కేసులో మండలంలోని ఇప్పల్ నవేగం గ్రామానికి చెందిన దసరి వాడ దొండిబా (66) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్ది రోజులుగా మద్యానికి బానిసైన దొండిబా కూలీకి వెళ్లిన సమయంలో అక్కడే పురుగులమందు తాగాడు. పక్కన చేన్‌లో ఉన్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుండి మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. కుమారుడు చంద్రబాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

27న ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలి

● ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు పిలుపు



నవతెలంగాణ-నార్నూర్

27న నిర్వహించే ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఆదివాసీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, డీఎస్సీలో ఏజెన్సీ కోటా ప్రకటించాలని, జీఓ నెంబర్.3ను యథావిధిగా కొనసాగించాలని, ప్రత్యేక ట్రైబల్ అడ్వైజర్ కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. ఐటీడీఏలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌కు సమాజ పెద్దలు, మేధావులు సంఘ బాద్యులు కార్మికులు వ్యాపారవేత్తలు, విద్య సంస్థలు, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇందులో వివిధ సంఘాల నాయకులు మరప గంగారాం, మెస్రం గోవింద్, కొడప లింగు, మెస్రం సంతోష్, మడావి భగవంత్‌రావ్, అడా భారత్, ఆత్రం విజయ్, నాగేందర్, జుగాదిరావ్ ఉన్నారు.

పేద కుటుంబానికి యువకుల చేయూత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓ పేద కుటుంబానికి నేషనల్ సోల్జర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆసరాగా నిలిచారు. పట్టణంలోని స్థానిక ఖానాపూర్ కాలనీకి చెందిన ముదాం సురేష్ రోజువారి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ ఇంటిపట్టునే ఉండటంతో కుటుంబ పోషణ కూడా కష్టమైంది. సదరు వ్యక్తికి భార్య గీత ఆరుగురు ఆడపిల్లలు ఉండటం వారిని పోషించ లేకపోవడం గమనించిన ఆ కాలనీకి చెందిన నేషనల్ సోల్జర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు ఆదివారం యూత్ ఆధ్వర్యంలో సురేష్ కుటుంబానికి నెలకు సరిపడా సరుకులు బియ్యం పప్పులు నూనె వంటి ఇతరత్రా అవసరమైన నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ ఇకమీదట తమ యూత్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని పేర్కొన్నారు. అవసరంలో ఉన్న నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన యువకులను కాలనీకి చెందిన పలువురు అభినందించారు. కార్యక్రమంలో నేషనల్ సోల్జర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు వినోద్ కుమార్, రాజేందర్, కరుణాకర్, సుధీర్, ప్రేమ్ విశాల్, రమేష్, జైపాల్, దుర్గ ప్రసాద్, ప్రమోద్, లెనిన్, రవీందర్, మహేష్, మహేందర్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో పెడదారి పడుతున్న యువత

నవతెలంగాణ-కాగజ్‌నగర్



గంజాయి, డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత పెడదారి పడుతోందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిశెల కార్తీక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ అన్నారు. ఆదివారం వారు 'గంజాయి డ్రగ్స్ నివారిద్దాం, సమాజాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో కూడిన మాదకద్రవ్యాల నివారణ పోస్టర్లను కాగజ్‌నగర్ టౌన్ సీఐ శంకరయ్య, ఎస్ఐ దీకొండ రమేశ్ చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ దేశాభివృద్ధికి వెన్నెముకగా నిలవాల్సిన యువత, దురదృష్టవశాత్తు కర్తవ్యాన్ని విస్మరించి మత్తులో తేలియాడుతోందన్నారు. యవతను మత్తులో ముంచి చిత్తు చేసే మాదకద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు డీవైఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సరిహద్దున ఉన్న మహారాష్ట్ర నుండి మన జిల్లాలోకి విచ్చలవిడిగా మాదకద్రవ్యాల సరఫరా జరుగుతోందని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. దీనికి స్పందించిన సీఐ శంకరయ్య మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాలు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. వీటి నిర్మూలనకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టికానంద్, ఉపాధ్యక్షుడు నిఖిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వసాకె సాయికుమార్, సహాయ కార్యదర్శి నిలీష్ పాల్గొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు (టి) మండలం వేంపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికను మాయమాటలతో మభ్యపెట్టి తీసుకువెళ్లిన పెద్దపల్లి జిల్లా అంతర్‌గాంకు చెందిన గణేష్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. మైనర్ బాలిక తప్పిపోయినట్లు ఆ బాలిక తల్లిదండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. బాలికకు మాయమాటలు చెప్పి తీసుకువెళ్లిన గణేష్‌పై పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

2
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | 26 ఆగస్టు, 2024 | www.navatelangana.com

బాధితులకు పరామర్శ

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు గడ్డింటి ప్రశాంత్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు ఆదివారం మంజులాపూర్‌లోని వారి నివాసంలో పరామర్శించారు. ప్రశాంత్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా ఇంద్రనగర్‌లోని మాజీ జెడ్పీటీసీ ఫణిందర్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆయన వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరలో కోలుకోవాలని మనోధైర్యాన్నిచ్చారు. పరామర్శించిన వారిలో గుల్లె రాజన్న, అయిండ్ల పోశెట్టి, అంబేకర్ ప్రసాద్, కొంతం గణేష్, అడిదెల రాజేశ్వర్, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు అతీక్ అహ్మద్, కలీం ఉన్నారు.

వరుణ్ వైన్స్‌లో చోరీ..

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలోని వరుణ్ వైన్స్‌లో శనివారం రాత్రి ఒంటిగంట సమయంలో దొంగలు చొరబడ్డారు. వరుణ్ వైన్స్‌లో పనిచేసే రాకేష్ అనే యువకుడు ఉదయం ఆరు గంటల సమయంలో వైన్స్ వద్దకు వెళ్లగా అక్కడ వైన్స్ షాప్ షెటర్‌ను రాడ్డుతో లేపినట్టు, అక్కడున్న సీసీ కెమెరాల వైర్లను తీసి పడేశారు. వెంటనే వైన్స్ యజమాని వికాస్ కుమార్‌కు ఫోన్ చేసి తెలుపడంతో, ఆయన పోలీసులకు సమాచారం అందించారు. కాగా సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. యజమాని రూ.లక్షా 23వేల 360 మద్యం, రూ.8వేల 50 నగదు దోచుకెళ్లినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. హెడ్ కానిస్టేబుల్ రాజన్న కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కొంతమద్యం పంట పొలాల్లో పారేవేసి, వెళ్లినట్టు వాటిని కానిస్టేబుళ్ల దినేష్, లక్ష్మణ్, సుధాకర్ వెతికి తీసుకొచ్చి యజమానికి అప్పగించారు.

రూ.6లక్షల చెక్కు అందజేత

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కుటుంబ సంక్షేమ నిధి నుంచి ఈ నెల 10న స్వర్గస్తులైన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు నాకిడి బక్కన్న ఎస్‌జీటీ తల్వేద వారి కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.6లక్షల చెక్కును అందజేశారు. బక్కన్న సంస్మరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల సమక్షంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య ప్రధాన కార్యదర్శి చావ రవి, చేతుల మీదుగా నాకిడి బక్కన్న కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ పెన్షనర్స్ సంఘ కార్యదర్శి ఎంసి లింగన్న, జిల్లాలోని వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



నవతెలంగాణ-సారంగాపూర్

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని జామ్ గ్రామంలో గణేష్ మండపాల నిర్వహాకులతో మాట్లాడారు. గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని గణేష్ మండప నిర్వహాకులకు, యువకులను పలు సూచనలు చేశారు. మండపాల సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. భక్తి శ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రులు నిర్వహించుకోవాలన్నారు.

జాబ్ క్యాలెండర్ ఒక బూటకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ బూటకమని యువత నమ్మే ప్రసక్తే లేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాణ్యమైన విద్యతో పాటు ఉద్యోగ నోటిఫికేషన్లు అందించడంతో ఆ సత్ఫలితాలను నేటి విద్యార్థులు అందుకోగలుగుతున్నారని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన క్యాతం అపర్ణ ఏఈఈ ఫలితాల్లో సత్తా చాటి. మిషన్ భగీరథ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈ ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మహాలక్ష్మివాడలోని వారి నివాసనికి వెళ్లి, విద్యార్థిని క్యాతం అపర్ణతో పాటు వారి తల్లిదండ్రులు రమేష్ వెంకటమ్మను శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. చైర్మెన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను యువత నమ్మే పరిస్థితిలో లేదని అది ఒక బూటకమని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2022-23లో వచ్చిన నోటిఫికేషన్‌లో ఉద్యోగం సాధించడం జరిగిందని తెలిపారు. విద్య పై ప్రతి ఒక్కరూ పట్టు సాధించినట్లయితే ఇలాంటి మరెన్నో విజయాలను అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పందిరి భూమన్న, అశోక్ స్వామి, గోలి శంకర్, చెన్నై సాయి, కాలనీవాసులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు ఉద్యోగుల సంఘం ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

తాలుకా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని అంకోలి మున్నూర్ కాపు ఉద్యోగుల సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుదరి రాహుల్, ప్రధాన కార్యదర్శి ఎర్రం రాహుల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎర్రం ప్రభాకర్, హరిదాస్, ఎర్రం నర్సింగరావు, కనక రమణ, పుదరి చంద్రశేఖర్, కళ్యాణం కృష్ణ, ఆదా నవీన్, సుగ్గం నర్సింగ్, బంతిపెల్లి రాకేష్, మాధస్తు పోశెట్టి, పూదరి చంటిబాపు, ఎర్రం అశోక్, జగడం పెద్ద స్వామి, సుగ్గం సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా గోకులాష్టమి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్





ఆదిలాబాద్ పట్టణంలోని ప్రయివేట్, ప్లేస్కూళ్లలో ఆదివారం ముందస్తుగా గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపిక, కృష్ణుడి వేషాధారణలో అలరించారు. పాఠశాలల్లో ఉట్టీ కొట్టే కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆడిపాడుతూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల పండగ విశిష్టత గురించి, విద్యార్థులకు వివరించారు.

తాంసి : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పొన్నారి గ్రామంలోని శ్రీ మురళీకృష్ణ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సోమవారం వేకువ జామున స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం నగర సంకీర్తన అనంతరం ఉట్టి కొట్టి జన్మాష్టమి వేడుకలను చేపట్టనున్నట్లు సుందర సత్సంగ్ అధ్యక్షుడు మలపతి సుభాష్ తెలిపారు. మంగళవారం భజన గీతాలాపన చేసి అన్నదానం నిర్వహించనున్నారు. భక్తులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రోడ్లు ఇలా.. ప్రయాణమేలా..?

- పాలకుల, అధికారుల నిర్లక్ష్యం, ప్రజలకు ఇబ్బందులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అధికారంలో ఎవరు వచ్చినా పాలకుల నిర్లక్ష్యంతో రోడ్లను నిర్మించక పోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. కొన్ని గ్రామాలకు గతంలో వేసిన తారు రోడ్లు గుంతలుగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎక్కడ చూసినా గుంతలు పడి మోకాళ్ల లోతు నీటితో దర్శనమిస్తున్నాయి. దీంతో మారుమూల గ్రామాల ప్రజలు వివిధ పనులకై మండల కేంద్రానికి రావాలన్న నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని దుబ్బగూడ గ్రామం ప్రధాన రోడ్డు నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి గతంలో నిధులు మంజూరైన తమ పార్టీకి ఓటేయలేదంటూ ఏకంగా లొకేషన్‌ను మార్చేసి రోడ్డును ఇతర ప్రాంతానికి తరలించారు. ప్రస్తుత ప్రభుత్వ హయంలో రూ.95 లక్షల నిధులు మంజూరయ్యాయి. టెండరు సైతం పూర్తైన ఇంతవరకు రోడ్డు పనులను మాత్రం ప్రారంభించలేదు. దుబ్బగూడ గ్రామ ప్రజలు




నిత్యావసర వస్తువులు, కిరాణా సామాను కొనాలన్నా, వైద్యం చేయాలన్న బురదలో కాలువేసి నడవాల్సిన దుస్థితి నెలకొంది. ఇంద్రవెల్లి మండల కేంద్రం నుంచి వడగావ్ మీదుగా లాల్ టెక్డి, దస్నాపూర్ మీదుగా ముత్నూరు వరకు సుమారు 26 కిలోమీటర్ల బీటీ రోడ్డు గుంతలుగా మారి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణం చేయడం నరక యాతన నెలకొంది. పిట్టబొంగరం ఓల్‌మద్రి గ్రామం మధ్య బ్రిడ్జి వద్ద పెద్ద గుంత ఏర్పడటంతో అటువైపు వెళ్లే వాహన చొదకులకు కత్తి మీద సాముగా మారింది. దీంతో పై గ్రామాల ప్రజలు అత్యవసర వేళలో వైద్యం కోసం వెళ్లాలన్న, 108 అంబులెన్స్ వాహనం రావాలన్న నానా ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పై రోడ్లపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వాస్పత్రిలో చెట్లు నరికివేత

- సిబ్బంది తీరుపై యువకుల ఆగ్రహం



నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న చెట్లను ఆదివారం నరికి వేయటంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఒకపక్క మొక్కలు నాటుమని పిలుపునిస్తుండగా, మరోపక్క ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేయటం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక యువకులు ఆస్పత్రికి వెళ్లి వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. అనుమతి లేకుండా చెట్లను నరకడం సబాబు కాదని అన్నారు. చెట్లు నరికిన విషయం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఒకపక్క హరితహారాన్ని ప్రోత్సహిస్తుండగా, మరోపక్క ప్రభుత్వం అధికారులే ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేయించటం విమర్శలకు తావిస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెట్లను నరికివేయాలంటే ముందుగా సంబంధిత శాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకున్న తర్వాత చెట్లను నరకాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా ఇలాంటి చర్యలకు పాల్పడటంపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయం సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ జాదవ్ నవతెలంగాణ ఆదివారం ఫోన్‌లో వివరణ కోసం ప్రయత్నించగా ఎట్టకేలకు స్పందించారు. ఈ విషయం నాకు ఆలస్యంగా తెలిసిందని ఆయన చెప్పారు. చెట్లను నరికిన వ్యక్తికి కొమ్మలు తీసి వేయాలంటే చెట్టును పూర్తిగా తీసివేసినట్టు తన దృష్టికి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే చెట్లపై గబ్బిలాలు ఉండటంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అయితే కొమ్మలు తీసేయమని సదరు వ్యక్తికి చెప్పగా అర్థం కాక చెట్టును పూర్తిగా నరికి వేసినట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పుకొచ్చారు.

సైన్స్ పరిశోధనల వైపు దేశం పయనించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మన దేశం ప్రపంచంలోనే మొదట స్థానంగా ఎదగాలంటే ఏకైక మార్గం సైన్సేనని అందుకే సైన్స్ పరిశోధనల వైపు దేశం పయనించాలని రిటైర్డ్ బ్యాంక్ ఎంప్లాయ్ యూనియన్ సభ్యులు సామల వీరన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఐదో మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలు సైన్స్ రంగంలోనే ఎక్కువ నిధులు కేటాయించి, సైన్స్ శాస్త్ర పరిశోధన ప్రోత్సహించడం వల్లనే ఆ దేశాలు ముందడుగులో ఉన్నాయని దీన్ని మనం స్ఫూర్తిగా తీసుకొని ప్రతి పాఠశాలలోని విద్యార్థులను ఈ సైన్సు పరిశోధనల వైపు సైన్స్ వైపు మళ్లించాలని అన్నారు. అందుకు ఉపాధ్యాయులుగా, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులుగా మీరు సైన్స్ అభివృద్ధి కోసం శాస్త్రీయ ఆలోచన పెంపొందించడం కోసం విద్యార్థులను, సమాజాన్ని చైతన్యవంతం చేయాలని అన్నారు. ఈ



కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్, లిటిల్ ఫ్లవర్ కరస్పాండెంట్ దేవేందర్ పటాస్కర్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్‌రెడ్డి, కోశాధికారి కత్తి శ్రీధర్‌బాబు, జిల్లా నాయకులు గంగన్న, సంజీవరెడ్డి, ఉశన్న, ప్రమోద్, ఉమకాంత్, లింగారెడ్డి, వినోద్, సురేష్, స్వామి, ఉమామహేశ్వర్, రాకేశ్, సాంబయ్య, జగన్ మోహన్ పాల్గొన్నారు.

సాగునీటి విడుదలతో రైతాంగానికి ఊరట

- ఎమ్మెల్యే చొరవతో అదనంగా సాగునీరు విడుదల
- 14వేల ఎకరాలకు అందనున్న సాగునీరు

నవతెలంగాణ-భైంసా

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ చొరవతో గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు ఊరట లభించింది. రైతాంగానికి వేసవిలో సాగు నీటికి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం జీఓను విడుదల చేసినట్టు ఎమ్మెల్యే తెలియజేశారు. ఆదివారం భైంసాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్ట్ కెపాసిటీ 358.7 మీటర్లు కాగా, ప్రాజెక్టులో 357.5 మీటర్లు నీరునిల్వ ఉంటేనే 2017 జీఓ ప్రకారం సాగునీరు విడుదలకు ఆస్కారం ఉండేది. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తేవడం జరిగిందన్నారు. ప్రభుత్వం 355.9 మీటర్ల



వరకు నీరు ఉన్నప్పటికీ సాగునీరు వాడుకోవచ్చని జీఓ విడుదల చేయడంతో 0.6 టీఎంసీల నీరు అదనంగా వాడుకోవడంతో 6వేల ఎకరాలకు అదనపు సాగు నీరందడంతో 14వేల ఎకరాలకు ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ జీఓ విడుదల వల్ల ప్రాజెక్ట్ ఎగువ భాగం లో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కుబీర్ మండల రైతులకు సాగునీరు అందుతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ తానూర్ మండలాధ్యక్షులు చిన్నారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్దా, కౌన్సిలర్ కపిల్, నాయకులు కృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ గ్రామంలో గంగయ్య కిరణా దుకాణంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు కిరణ షాపు నుంచి రూ.20వేల నగదు దోచుకెళ్లినట్టు పోలీసులు తెలిపారు. అదే రోజు రాత్రి ప్రభ దుకాణంలో చోరీకి ప్రయత్నించగా షట్టర్లు తెరచు కోకపోవడంతో వెనుతిరిగినట్టు పోలీసులు తెలిపారు. గంగయ్య ఎప్పటిలాగా తన కిరాణా దుకాణానికి షెటర్ తాళం వేసి వెళ్లగా ఆదివారం ఉదయం కిరణ షాపుకు రాగా షటర్ తెరుచుకొని ఉండటంతో పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

ఏజెన్సీ బంద్‌కి లంబాడా జేఏసీ మద్దతు



నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 27న మంగళవారం తలపెట్టిన ఏజెన్సీ బంద్‌కు లంబాడ నిరోద్యోగులు, ఉద్యోగులు లంబాడ జేఏసీ తరుపున మద్దతు ఇస్తున్నామని లంబాడా జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీఓ నెంబర్ 3ను యథావిధిగా కొనసాగించాలని, ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీని వెంటనే భర్తీ చేయాలని, 317 జీఓను వెంటనే రద్దు చేసి, ఏజెన్సీ ప్రాంతాలలో ఏజెన్సీ ఉద్యోగస్తులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మాజీ ఎంపీటీసీ జాదవ్ గోపాల్ రావు, జేఏసీ కార్యదర్శి బానోత్ రామారావు, నేతవాత్ రాందాస్, ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు జాదవ్ సుమేష్, రాథోడ్ సుధాకర్, రాథోడ్ మహేందర్, గిరిజన లంబాడీల ఐక్యవేదిక (లైవ్)ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ్ వసంత్‌రావు, నిరోద్యుగులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-నేరడిగొండ

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని బోథ్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తన నివాసంలో పెంట జానకికి మంజూరైన రూ.28వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న పేదలకు సహాయంగా ప్రభుత్వం సీఎం సహాయనిధి కింద వైద్య ఖర్చులకు సహాయాన్ని అందిస్తుంది. అందులో బాగంగానే లబ్ధిదారులైన పెంట జానకికి రూ.28వేల చెక్కును అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయశాఖ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు అల్లూరి ప్రఫుల్ చందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, పోతారెడ్డి, మౌలానా ఉన్నారు.

అన్నాభావుసాఠే 104వ జయంతిని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 27న గాదిగూడ మండలంలోని కొలమా గ్రామంలో నిర్వహించే అన్నాభావు సాఠే 104వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ నాయకులుగా గాయక్వాడ్ మారుతి అన్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో దళిత నాయకులకు ఆహ్వాన పత్రం అందించారు. జయంతి ఉత్సవానికి అధిక సంఖ్యలో నాయకులు, ప్రజలు పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు. ఆహ్వాన పత్రం అందించిన వారిలో నాయకులు కుమ్ర, శంకర్, గేరే దయానంద్, నాగనాథ్, సంజు, రావ్ సాబ్, గేరే శేషరావు, కాంబ్లె భగవాన్, శివాజీ, రాజు, మహదు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడి వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని చాందా(టి) బైపాస్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిన ఘటనలో కొలీపురకు చెందిన కారింగుల పోతలింగుకు తీవ్ర గాయాలయ్యాయి. అది గమనించిన స్థానికులు వెంటనే రిమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు రిమ్స్ వైద్యులు తెలియజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాయిద్ తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | 26 ఆగస్టు, 2024 | www.navatelangana.com

బాలికను మోసగించిన బాలుడు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రానికి చెందిన ఓ బాలిక(13)ను మైనర్ బాలుడు (16) ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి మోసం చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. డీఎస్పీ సదయ్య తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన ఓ మైనర్ బాలుడు మత్తు పదార్థాలు చెడు తిరుగుళ్లకు బానిసై మరో మైనర్ బాలికతో స్నేహం చేసి ఫోన్‌లో వీడియో కాల్ మాట్లాడుతూ నగ్నంగా మాట్లాడమని కోరాడు. మొదట ఒప్పుకోని బాలిక తర్వాత అంగీకరించగా వీడియో కాల్ మాట్లాడే క్రమంలో స్క్రీన్ షాట్ చేసి బాలికను బ్లాక్ మెయిల్ చేసి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించి జేఎఫ్‌సీఎం బెల్లంపల్లి ఇన్‌చార్జి జువెనైల్ జస్టిస్ బోర్డు ఆసిఫాబాద్ ఎదుట హాజరుపర్చగా బాలుడిని పిల్లల సంరక్షణ గృహానికి పంపించినట్లు తెలిపారు. బాలికలు, మహిళలు ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థి దశలో పిల్లల నడవడికను గమనించి, వారిని సక్రమమైన దారిలో నడుచుకునేట్టు తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు.

లక్ష్మీపూర్‌లో వైద్యశిబిరం

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఆదివారం ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న నలుగురి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా గ్రామస్తులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రమోద్, ఏఎన్ఎం పుష్పలత, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి


నవతెలంగాణ-దహెగాం



గత నెల 18న దహెగాం మండలంలోని మర్రిపల్లి స్టేజీ వద్ద యాక్సిడెంట్‌లో గాయపడిన గిరవెల్లికి చెందిన అల్లూరి శంకర్ (63)ను మంచిర్యాల, వరంగల్, చంద్రాపూర్, హైదరాబాద్‌లలో చికిత్సలు అందించారు. నయం కాకపోవడంతో శనివారం ఇంటికి తీసుకువచ్చారు. ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కందూరి రాజు తెలిపారు.

పెరిగిన వరద.. ఎత్తిన గేట్లు

- అడ, వట్టివాగు ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఏజెన్సీ మండలాల్లో శుక్ర, శనివారాలు భారీ వర్షాలు నమోదు కావడంతో మండలంలోని రెండు ప్రాజెక్టులకు వరద నీరు వస్తుంది. దీంతో అధికారులు వట్టివాగు, కుమురం భీం ప్రాజెక్ట్ వట్టివాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. కుమురం భీం ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 243 మీటర్ల గాను 237.7 మీటర్ల చేరుకుంది. ప్రాజెక్టులోకి 745 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో 4వ, 5వ గేటు 0.20మీటర్లు పైకెత్తి 784 క్యూసెక్కుల బయటకు వదులుతున్నారు. అలాగే వట్టివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 239.5 మీటర్ల గాను 238.9 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 3500 క్యూసెక్కుల వరద నీరు వచ్చే చేరుతుండడంతో 3,4 నెంబర్ గేట్లను 1.0 మీటర్ ఎత్తి ఆదివారం ఉదయం 3600 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. దీంతో కుమురం భీం ప్రాజెక్ట్, వట్టివాగు ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంజనీరింగ్ అధికారులు సూచిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య బుద్ధులు నేర్పించిన గురువులు శంకర్, స్వామి, ప్రభాకర్‌లను సత్కరించి ఆశీర్వాచనలు తీసుకున్నారు. అనంతరం ఒకరినొకరు పరిచాయం చేసుకుంటు పాత జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు. కార్యక్రమంలో కిషన్ గౌడ్, రవీందర్, ప్రభాకర్, నరేందర్, మధుకర్, ఫణి కుమార్, ఆశిష్ కుమార్, సుజాత, నాగమణి పాల్గొన్నారు.

రేపటి ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తిర్యాణి

ఆదివాసుల సమస్యల సాధన కోసం ఈనెల 27న చేపట్టిన ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ జిల్లా కోకన్వీనర్ సుభాష్ కోరారు. ఆదివారం మండలకేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత రక్షణకై చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ ఈనెల 27న ఏజెన్సీ ప్రాంత బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ప్రజలు, విద్యార్థులు, నాయకులు, యువతీ, యువకులు, కార్మిక కర్షక కళాకారులు, ఆదివాసీ అన్ని సంఘాల నాయకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పండ్ల మొక్కలు నాటిన స్నేహ కల్చర్ ఆర్ట్స్ సభ్యులు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఖైరిగూడ అడవిలో స్నేహ కల్చరల్ ఆర్ట్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో హార్ట్ ఫుల్ నైస్ సహకారంగతో 50 పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ పండ్ల మొక్కలు జంతువులకు వాటి జీవనమానుగడకు ఎంతో ఉపయోగకరంగా, మనిషి జీవితానికి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించడానికి ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరు అడవిలో పండ్ల మొక్కలు, పండ్ల విత్తనాలు నాటాలన్నారు. కార్యక్రములో మహేందరరెడ్డి, వీరాస్వామి, కిరణ్, రాజకుమార్, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఏకీకృత పెన్షన్ పేరిట మరో మోసం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ పేరిట మరో మోసానికి తెర లేపుతోందని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ ఖమర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత పెన్షన్ స్కీం స్థానంలో ఇప్పటికే సీపీఎస్‌ను తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వం, మళ్లీ ఏకీకృత పెన్షన్ విధానాన్ని ప్రకటించి మసి పూసి మారేడుకాయ చేస్తోందని విమర్శించారు. 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారంటీ అని, సర్వీసులో మరణించిన ఉద్యోగి కుటుంబానికి 60 శాతం కుటుంబ పెన్షన్ ఇస్తామని ప్రకటించారని, కానీ చందాతో కూడిన పెన్షన్ పథకం రద్దు విషయంలో ఎలాంటి ప్రస్తావన తీసుకురాలేదని పేర్కొన్నారు. పైగా ఐచ్ఛికం అనే అంశాన్ని జోడించారని, ఇందులోనే అసలు మోసం ఉందన్నారు. ఒక్క రూపాయి చందా చెల్లించకుండానే సర్వీసును బట్టి 50 శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినందున దీనికి కట్టుబడి ఉండాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

గిరి గ్రామాలపై చిన్న చూపు

- వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు
- ఇబ్బందుల్లో ఆదివాసీ జనం



నాగలగొంది గ్రామం

నవతెలంగాణ-కెరమెరి

గిరిజనుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అయితే వాస్తవిక పరిస్థితులు మాత్రం దీనికి భిన్నంగా ఉన్నాయి. నేటికి మారుమూల గ్రామాల సరైన రోడ్డు సౌకర్యం లేక ఆదిమ జాతి గిరిజనులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీలు అమలు పరచడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ చిన్న పని నిమిత్తమైన వాగులు, వంకలు దాటి మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. దీంతో మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యం లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి తారు రోడ్డు నిర్మించాలని ఎన్నికల సమయంలో నాయకులకు విన్నవిస్తున్న హామీ ఇస్తున్నారు తప్ప అమలుకు నోచుకోవడం లేదు. మండలంలోని నాగల్‌గొందితో పాటు కోలాంగూడ, నాయకపు గూడ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అదిమజాతి గిరిజనులు రాకపోకలకు పడుతున్న ఇబ్బందులపై ప్రత్యేక కథనం..

అగర్వాడ గ్రామపంచాయతీ పరిధిలోని నాగలగొంది మండల కేంద్రం నుండి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామంతో పాటు పరిసర గ్రామాలలో మొత్తం జనాభా 60 కుటుంబాలు ఉండగా 436 మంది జనాభా ఉన్నారు. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నాయకపుగూడ, నాగలగొంది గ్రామాల గిరిజనులు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామానికి తారు రోడ్ లేక నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం నుండి అగర్వాడ గ్రామం వరకు 10 కిమీ తారు రోడ్డు సౌకర్యం ఉన్న అగర్వాడ నుండి నాగలగొంది వరకు 9 కిలోమీటర్ల దూరం అడవుల గుండం మట్టి రోడ్డుపై, రాళ్ల మధ్య ప్రయాణం చేయాల్సిందే. మట్టిరోడు వర్షాలకు బురదమయంగా మారి నడిచి వెళ్లేందుకు వీలులేని దుస్థితి. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు గ్రామాల వరకు రాలేని పరిస్థితి. వాహనాలు సైతం అడపా దడపా తప్పితే అందుబాటులో ఉండవు..

వర్షాలకు కొట్టుకపోయిన కల్వర్టు

ఇటీవల కురుస్తున్న ఎడతెరపిలేని వర్షాల కారణంగా అగర్వాడ, నాయకకపు కూడా గ్రామాల మధ్య ఒర్రె అడ్డంగిగా మారింది. చలి, వేసవి కాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకున్నా, వర్షాకాలం మాత్రం వీరి బాధలు వర్ణాతీతం. ఎగువ ప్రాంతంలో ఏ మూలన వర్షం కురిసిన ఒర్రె నిండుగా ప్రవహిస్తుంది. దీంతో మండల కేంద్రానికి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది.





వంతెన లేకపోవడంతో వాగులో నుంచి వెళ్తున్న వాహనాలు

గతంలో వరద ప్రవాహానికి బాలుడు మరణించాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డంతా బురదగా మారింది. రోడ్డుపై రాళు తెలి కల్వర్టు వద్ద పైపులు బయట పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేన్లకు వెళ్లాలన్నా తిప్పలే

అగర్వాడ గ్రామానికి చెందిన కొంతమంది రైతుల వ్యవసాయ భూములు నాయకపు కూడా సమీపంలో ఉండడంతో వర్షాకాలం చేళ్లకు వెళ్లలేని దుస్థితి ఏర్పడుతుందని గ్రామ ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా అటుగా వెళ్లే ఇతర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు, వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని జిల్లా ప్రజా ప్రతినిధులు అధికారులకు విన్నవించిన ఇప్పటివరకు నిర్మాణం గురించి ఉసేత్తడం లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అగర్వాడ నుంచి నాగలగొంది వరకు తారు రోడ్డు నిర్మాణంతో పాటు మార్గమధ్యలో ఉన్న ఒర్రెపై వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

తారు రోడ్డు మంజూరు చేయాలి

గెడం మధుకర్, మాజీ సర్పంచ్

దశాబ్దాలుగా మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. దీంతో మండల కేంద్రానికి చేరుకోవడానికి అనేక కష్టాలు పడుతున్నాం. వర్షాకాలంలో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మట్టి రోడ్డు అంతా బురద మయంగా మారి రాళ్లుతెలడంతో వ్యయ ప్రయాసలు పడుతున్నాం. అత్యవసర సమయాల్లో మండల కేంద్రానికి చేరుకోవడానికి వాహన సౌకర్యం ఉండదు. తారు రోడ్డు మంజూరు చేస్తే రవాణా కష్టాలు తీరుతాయి.

వంతెన నిర్మాణం చేపట్టాలి

సిడాం ధర్ము ఐటీడీఏ సూపర్‌వైజర్

నాగల్‌గోంది గ్రామానికి వెళ్లాలంటే మార్గ మధ్యలో ఒర్రె అడ్డంకిగా మారింది. వర్షాలకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. దీంతో మండల కేంద్రానికి వెళ్లాలన్నా, చేన్లకు పోవలన్నా కష్టంగా మారింది. ఒర్రెపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వంతెన నిర్మాణం చేపట్టాలి.



నాగలగొందికి వెళ్లే రోడ్డు



భారీ వర్షాలకు పైప్‌లు తెలిన నాగల్‌గొంది సమీపంలోని కల్వర్టు

సంపూర్ణ బంద్‌కు సహకరించాలి

- తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్



కెరమెరి : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుడుం దెబ్బ నాయకులు

నవతెలంగాణ-కెరమెరి

ఈనెల 27న ఏజెన్సీ బందుకు సహకరించాలని తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట బద్దతలేని వలస లంబాడాలను తొలగించాలని, ఐటీడీఏ ద్వారా ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్‌తో బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. బ్యాక్ లాగ్ పోస్టులను ఆదివాసీ నిరుద్యోగుతో భర్తీ చేయాలన్నారు. జీఓ 3 పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు స్పందించి ఆదివాసులకు న్యాయం చేయాలన్నారు. మండలంలో ఏజెన్సీ ప్రాంత భూభాగం అన్యాక్రాంతమైన భూములపై సమగ్ర విచారణ జరిపి ఆదివాసీ హక్కులను చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పోరు గ్రామాల యువజన సంఘం అధ్యక్షులు పేందూర్ రాజేశ్వర్, విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు సెడ్మాకి తుకారం, ఆదివాసీ మండల నాయకులు తొడసం జగన్నాథ్ రావ్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ఏజెన్సీ ప్రాంత రక్షణకై చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ ఈనెల 27న తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ కోవ విజయ్ కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో లంబాడీలను తొలగించాలని, ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని, జీఓ ఎంఎస్ నంబర్ 3ని కొనసాగించాలని, ఐటీడీఏలో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, 29 శాఖల్లో ఉన్న జీఓలను చట్టంగా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న మంగళవారం బంద్‌కి పిలుపు ఇవ్వడం జరిగిందని అన్ని వర్గాల ప్రజలు బంద్‌కు సహకరించాలని కోరారు.

ఆర్టీసీ కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కావాలి

- ఈయూ డిపో కార్యదర్శి దివాకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్‌తో పాటు వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) డిపో కార్యదర్శి దివాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2013 సంవత్సరం బాండ్ల డబ్బులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వెల్ఫేర్ బోర్డులను రద్దుచేసి ట్రేడ్ యూనియన్ పునరుద్ధరించాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని ఈనెల 27న నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన, సెప్టెంబర్ 10న డిమాండ్ డే నిరసన, అక్టోబర్ 1న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే సామూహిక నిరాహార దీక్షలను ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షులు ఎల్సుల అశోక్, సీపీఐ జిల్లా నాయకులు పిడుగు శంకర్, ఆత్మకూరు చిరంజీవి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సురేష్, సులేమాన్, ఎజాజ్, ఉమేష్, ఆనంద్ రావు పాల్గొన్నారు.

పులాజీ బాబా జయంతి పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 30న జిల్లాలోని జైనూర్ మండలం పాట్నాపూర్‌లో జరగనున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పూలజీ బాబా శత జయంతి వేడుకలకు సంబంధించి పోస్టర్‌ను ఆసిఫాబాద్ సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్‌తో కలిసి పులాజీ బాబా కుమారుడు వామన్ రావ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రిక ఆయనకు అందజేశారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ మాట్లాడుతూ పులాజీ బాబా ఆదర్శాలు ప్రతి ఒక్కరు పాటించే విధంగా ఉంటాయన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరిని సమానంగా చూడాలని ఉద్దేశం ఎంతో గొప్పదన్నారు. శత జయంతి ఉత్సవాలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జాబరి రవీందర్, మాజీ సర్పంచ్ బూసి భీమేష్, ఆత్మ చైర్మన్ కురాట్కర్ రమేష్, మాలీ సంఘం అధ్యక్షులు నాగోషే శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీల అభివృద్ధి కోసం కృషి చేసిన బీపీ మండల్ జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం భవనంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీల కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. 1952లో కాంగ్రెస్‌తో రాజకీయ జీవితం ప్రారంభించిన మండల్ బీసీల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. రాజకీయంగా అభివృద్ధి చెందినప్పుడే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పురుషోత్తం బాలేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వైరాగడి మారుతి పటేల్, రైతు సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డల శంకర్, జిల్లా కార్యదర్శి మిట్ట తిరుపతి, సింగల్ విండో వైస్ చైర్మన్ ప్రహ్లాద్, సిడాం తిరుపతి పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | ఆగస్టు 26, 2024 | www.navatelangana.com

ప్రొఫెసర్ కోదండరామ్‌ని కలసిన మండల నాయకులు

నవతెలంగాణ-హాజీపూర్



ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి మండలానికి చెందిన టీజేఎస్ నాయకులు పాముల వెంకట సాయి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీజేఎస్ సోషల్ మీడియా విభాగం నాయకులు పాముల వెంకటసాయి మాట్లాడుతూ కోదండరామ్ సొంత జిల్లా అయిన మంచిర్యాల అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరారడం జరిగిందన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని రెబ్బెనపల్లి పాఠశాలలకు చెందిన 2006-07 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆ సమయంలో అటెండర్‌గా పని చేసిన శనిగారపు రాజలింగు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆయనకు రూ.7వేల ఆర్థిక సాయం అందజేసి బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పాఠశాలలో సేవలు అందించి పేదరికం వల్ల వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉండడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులున్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి

నవతెలంగాణ-జన్నారం

బీసీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతిని ఆదివారం మండల కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ కడార్ల నరసయ్య మాట్లాడుతూ బిందేశ్వరి ప్రసాద్ మండల్ మాజీ ముఖ్యమంత్రి, బీసీ సమస్యల నివేదన కమిషన్ చైర్మన్‌గా పనిచేసే 42 సిఫార్సులను కేంద్ర ప్రభుత్వానికి అందజేసిన మహా నాయకుడు అన్నారు. ఆయన కృషితోనే బీసీలకు విద్య ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కొనసాగుతున్నాయన్నారు. బీసీ మండల్ 106వ జయంతి సందర్భంగా జన్నారంలో చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్ల అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, మంచిర్యాల జిల్లా బీసీ కేయూపీఎస్ కన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ బాలసాని శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ చెట్పల్లి సత్యం, మంచిర్యాల డివిజన్ మోకుదెబ్బ అధ్యక్షుడు ఒల్లాల నరసగౌడ్, పొనకల్ పట్టణ మున్నూరు సంఘం కార్యదర్శి దాసరి శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు దండెవేణి శ్రీధర్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల



నవతెలంగాణ-నస్పూర్

శ్రీ చైతన్య పాఠశాల ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతుందని ఏఐఎస్బి జిల్లా కార్యదర్శి కనుకుంట్ల సన్నీ గౌడ్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. ఆదివారం మంచిర్యాలలోని శ్రీ చైతన్య పాఠశాలలో క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిసి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెలవు రోజుల్లో కూడా విద్యార్థులను ఇబ్బంది పెడుతూ క్లాసులు నిర్వహిస్తున్నారని, విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తే వారిపైన కేసులు పెడతామని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలు పాటించని ప్రయివేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు జిల్లాలో పాఠశాలలు ఎలా నడుస్తున్నాయో తెలియడం లేదని, విద్యాశాఖ అధికారులు చూస్తూ ఉండిపోతున్నారు తప్ప చర్యలు కనిపించడం లేదని ఆరోపించారు. మరో పక్క మండల విద్యాధికారి (ఎంఈఓ) స్పందించడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులే స్పందించకపోతే కార్పొరేట్ విద్యాసంస్థలు మమ్మల్ని ఎవరు ఏం చేయలేరు అనే భావంతో శ్రీ చైతన్య పాఠశాలను నడుపుతున్నారని అన్నారు. శ్రీ చైతన్య పాఠశాలలో క్లాసులు నిర్వహిస్తున్న యజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థి సంఘంగా డిమాండ్ చేశారు. పాఠశాల పై విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో జరిగే ఉద్యమాలకు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

నేతకాని సంక్షేమ సంఘం పొన్కల్ గ్రామ నూతన కమిటీని ఆదివారం జన్నారం ప్రెస్ క్లబ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బట్టి లక్ష్మణ్, అధ్యక్షుడిగా బట్టి(దుర్గం)వసంత్ కుమార్, ఉపాధ్యక్షుడిగా జాడి రాజన్న, ప్రధాన కార్యదర్శిగా బట్టి రవీందర్, కోశాధికారిగా బట్టి శంకర్, సంయుక్త కార్యదర్శిగా బట్టి బానయ్య, ప్రచార కార్యదర్శిగా జాడి సురేందర్, కార్యవర్గ సభ్యులుగా నాగరాజ్, జాడి గంగన్న, జాడి శ్రీనివాస్, దుర్గం లక్ష్మణ్, దుర్గం సత్యనారాయణ, గౌరవ సలహాదారులుగా డాక్టర్ ఎస్ పెద్దన్న, బట్టి రాజలింగంలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు, తాళ్లపల్లి రాజేశ్వర్ బోర్లకుంట ప్రభుదాస్, మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, నాయకులు జాడి గంగన్న బండారి స్వామి జన్నురి మల్లేష్, దుర్గం అమృత రావు, బట్టి బానయ్య బట్టి వసంత్ దుర్గం నందయ్య, దుర్గం వినోద్, అల్లూరి వినోద్ పాల్గొన్నారు.

అధ్యక్షుడికి నియామక పత్రం అందజేత

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులుగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్త వెంకటేశ్వర్లుకు ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారు. మహాసభ నుండి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా ఎన్నికైన అతన్ని సన్మానించారు. కార్యక్రమంలో మహాసభ ఉపాధ్యక్షుడు నలమాస్ కాంతయ్య, రాష్ట్ర కార్యదర్శి ముక్త శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షులు రేణి కుంట్ల శ్రీనివాసమ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-జన్నారం



గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య భవనంలో వర్తక, వాణిజ్య సంఘం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఫోన్కాల్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ జక్కు భూమేశ్, వర్తక సంఘం అధ్యక్షుడు వామన్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కార్యచరణ రూపొందిస్తామన్నారు. నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి సంఘ నాయకులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆవోప అధ్యక్షుడు కొత్త వేణుగోపాల్ గుప్తా, గోలి చందు, జక్కు రమేష్, వెంకటేష్ గోపి పాల్గొన్నారు.

బీజేపీలో ఎన్‌హెచ్-63 చిచ్చు..!

- జిల్లా అధ్యక్షుడే అన్యాయం చేస్తున్నాడని బాదితుల ఆరోపన
- రియల్ వ్యాపారులకు మద్దతు ఇస్తున్నాడని విమర్శ
- బండి సంజయ్ పర్యటనలో వెలుగు చూసిన వైనం

ఆర్మూర్ నుంచి జగ్దల్పూర్ వరకు నిర్మించ తలపెట్టిన ఎన్‌హెచ్-63 నిర్మాణ పనులను ప్రభుత్వం వేగిరం చేసింది. దీని కోసం గతంలోనే నోటిఫికేషన్ ఇచ్చి సర్వే కూడా పూర్తయింది. మంచిర్యాల జిల్లా పరిధిలో లక్షెట్టిపేట్ నుంచి బొక్కలగుట్ట వరకు సుమారు 36 కిలోమీటర్ల మేర గతంలో ప్రస్తుతం వున్న రోడ్డు నుండే అని సర్వే చేయగా కొన్నికారణాల వలన దాన్ని గ్రీన్ ఫీల్డ్‌హైవేగా మార్చి పంట పొలాల నుంచి వేస్తున్నారు. భూములు కోల్పోయే బాదితులు రోజు నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గత వారం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండల పర్యటన సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడే రియల్ వ్యాపారులకు అమ్ముడు పోయి రహదారి డిజైన్ మార్చారని బాధితులు విమర్శించారు. ఇది ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.



నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాలో నూతనంగ నిర్మిస్తున్న నాలుగు వరుసల జాతీయ రహదారి(ఎన్‌హెచ్-63) నిర్మాణంలో బాధితులతో బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో రోడ్డు నిర్మాణం సరిగ్గా లేదని కేవలం ఒక పక్క మాత్రమే భూసేకరణ చేస్తుండడంతో చాలా మంది ఇండ్లు పూర్తిగా కోల్పోవాల్సి వస్తుంది. దీనికి బాధితులు కేంద్ర రహదారుల శాఖ మంత్రి గడ్కారీని కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఆ రోడ్డు మ్యాప్‌ను మార్చి మళ్ళీ గ్రీన్ ఫీల్డ్ హై వేకు మొగ్గు చూపారు. దీని పై కూడా అభ్యంతరాలు రావడంతో బీజేపీ మంత్రి, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలతో లేకలు తీసుకురావాలని బాధితులకు సూచించారు. కానీ ఎంపీ, ఎమ్మెల్యేలు లెటర్ ప్యాడ్ ఇచ్చే అవకాశం లేదు. ఒక వైపు వారి న్యాయం కోసం చూస్తే ఇంకో వైపు వారి న్యాయం జరిగే అవకాశంఉంది. బాధితుల చేతులు వారి నెత్తిన పెట్టింది బీజేపీ ప్రభుత్వం.

పరిహారం ఊసెలేదు..

దేశ అభివృద్ధిలో బాగంగా జాతీయ రహదారుల విస్తరణ చేపడుతున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఆ విస్తరణలో ఇండ్లు భూములు కోల్పోయిన బాధితులకు తీరని అన్యాయం చేస్తోంది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి ఛత్తీస్ఘడ్ రాష్ట్రం జగ్దల్పూర్ వరకు జాతీయ రహదారుల సంస్థ నాలుగు వరుసల



రోడ్డు నిర్మాణం చేపడుతోంది. దీని కోసం మార్చ్ 14న ఎన్‌హెచ్ఏఐ నోటిఫికేషన్ విడుదల చేసింది. మంచిర్యాల జిల్లాలో గూడెం బ్రిడ్జి నుంచి క్యాతన్‌పల్లి వరకు 36 కిలోమీటర్ల మేర భూసేకరణ కోసం ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమి సేకరిస్తారో నోటిఫికేషన్‌లో పొందుపర్చింది. దీంతో పాటు ఓ మ్యాప్ విడుదల చేసింది. దీని ప్రకారం లక్షెట్టిపెట్ పట్టణంలో బై పాస్ కాకుండా పట్టణం మధ్యలో నుండి, గుడిపేట్ మీదుగా ముల్కళ్ళ వరకు మిషన్ భగీరథ పైప్ లైన్ పేరుతో రోడ్డుకు ఒక వైపే భూసేకరణ చేయడం వుండేది. అభ్యంతరాలు రావడంతో ఇది ఆగి పోయింది. కొందరి ఒత్తిడితో మళ్ళీ పంట పొలాల గుండ గ్రీన్ ఫీల్డ్‌కే మొగ్గు చూపారు. దీనిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రావు హస్తం ఉందని రియల్ వ్యాపారులకు లబ్ధి చేకూరే విధంగా రోడ్డు అలైన్ మెంట్ మార్చారని విమర్శిస్తున్నారు. వారికి ఎంత పరిహారం ఇస్తుందో ఇప్పటికీ తెలపకుండానే సర్వే నిర్వహిస్తోంది. కోల్పోతున్న ఇంటికి, భూమికి, బావులకు, బొర్లకు ఏ ప్రాతిపదికన ఇస్తారో చెప్పిన తరువాతే సర్వే చేయాలని కొందరు బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీ మైండ్ గేమ్..

ఎన్‌హెచ్ఏఐ విడుదల చేసిన మొదటి మ్యాప్, నోటిఫికేషన్‌లో రోడ్డుకు ఒక వైపు ఎక్కువ ఫీట్లలో విస్తరణ జరుగుతుంది. దీంతో బాధితులు ఎక్కువ మొత్తంలో నష్టపోవాల్సి వస్తుంది. కొందరి ఇండ్లు పూర్తిగా కోల్పోవాల్సి ఉంటుంది. దీనికి గతంలో నాగపూర్‌లో గడ్కారీని కలిసిన బాధితులు గడ్కారీ కార్యాలయం నుంచి బాదితులకు సమాచారం అందింది. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల నుండి రెండు వైపులా సమానం భూ సేకరణ జరపాలని ధ్రువీకరిస్తూ ఒక లెటర్ ప్యాడ్ తీసుకురమ్మని సమాచారం అందింది. అయితే ఒక వైపు మిషన్ భగీరథ మెయిన్ పైప్ లైన్ ఉండడం అది కూడా ప్రజల సొమ్మే కాబట్టి దానిని తొలగించమని ఎంపీ, ఎమ్మెల్యే చెప్పని పరిస్తితి. పైప్ లైన్ ఉందని అందుకే మా ఇండ్లు పోతలేవని ధీమాతో ఉన్న వారు. రెండు వైపులా సమానం భూసేకరణ చేస్తే వారి ఇండ్లు కోల్పోవాల్సి వస్తుంది. అందుకు వారు కూడా ఉద్యమించారు. వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వం అయితే ఆ పాత రోడ్డు గుండా రొడ్డును క్యాన్సల్ చేసి, కొత్తగా గ్రీన్ ఫీల్డ్ హైవే కే మొగ్గు చూపి సర్వే పూర్తి చేసింది. బాధితులకు నోటీసులు కూడా జారీ చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు గత వారం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జిల్లా పర్యటన సందర్భంగా ఎన్‌హెచ్-63 బాదితులు ఆయనను కలిసి తమ గోడును వినిపిస్తాము అంటే బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు అడ్డుకున్నారని, మమల్ని నమ్మించి మోసం చేశారని విమర్శించారు. రియల్ వ్యాపారులకులతో కుమ్మక్కై, రోడ్డు అలైన్ మెంట్ మార్చారని, ఇప్పుడు మమల్ని రోడ్డున వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి నోటీసులు ఎవరు తీసుకోవద్దు అంటూ జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు.

స్వచ్ఛదనం-పచ్చదనం ప్రభావమేది..?

- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం.. వృద్ధి చెందుతున దోమలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీజనల్ వ్యాధుల నేపథ్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా సీజనల్ వ్యాధులపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అయితే లక్షెట్టిపేట మున్సిపాలిటీలో మాత్రం నామమాత్రంగానే కార్యక్రమం నిర్వహించినట్లు తెలుస్తోంది. వార్డులల్లో చాలాచోట్ల పారిశుధ్య చర్యలు సక్రమంగా చేపట్టకపోవడంతో దోమలు వృద్ధి చెందాయి. దీంతో ప్రజలు జ్వరల బారిన పడుతున్నారు. మున్సిపాలిటీలోని పలు వార్డులలో కొన్ని రోజులుగా అనేకసార్లు ప్రత్యక్షంగ, సోషల్ మీడియా ద్వారా మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. వార్డులలో రోడ్లపై ఇరువైపులా గడ్డి పిచ్చి మొక్కలు ఎపుగా పెరిగాయి. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో దోమలు వస్తున్నాయి. మురుగు కాలువల్లో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. అయిన మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. కనీసం వార్డు ఇన్‌చార్జిలు కూడా పట్టించుకోకపోవడంతో ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో తెలుస్తుందని పలువురు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్షం.. విజృభిస్తున్న జ్వరాలు..

- కొల్లూరును సందర్శించిన సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-జైపూర్

గత నెల రోజులుగా జ్వరాలు పట్టి పీడిస్తున్నా.. ప్రభుత్వాధికారులకు పట్టింపు లేకుండాపోయిందని సీపీఐ(ఎం) నాయకుల బృందం ఆరోపించింది. సీపీఐ(ఎం) చెన్నూర్ ఏరియా కమిటి ఆధ్వర్యంలో ఆదివారం కొల్లూరు గ్రామాన్ని సందర్శించి, జ్వర పీడితులను కలిసి పరామర్శించింది. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి, ప్రభుత్వాధికారుల తీరుపట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ కొల్లూరు గ్రామపంచాయతీ పరిధిలో వైద్య సేవలు అందుబాటులో లేక దళిత కాలనీకి చెందిన పలువురు జ్వర పీడితులు, కీళ్ల నొప్పులతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి నుంచి ఉపశమనం పొందుటకు జీడి గింజలతో వాతలు పెట్టుకుంటూ, నాటు వైద్యం చేసుకుంటున్నారని అన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో ప్రభుత్వాస్పత్రులపై నమ్మక లేక ప్రయివేటు ఆస్పత్రుల్లో చేరి వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న క్రమంలో వైద్య సేవల పట్ల ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసేందుకు గాను నెల రోజుల నుంచి ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) హెచ్చరించినా, ప్రభుత్వ పెద్దలు, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీల వారిగా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, దోమల వ్యాప్తి నిరోధక చర్యలు చేపట్టాలని, మురుగు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామా అన్నట్లు కాకుండా జ్వరాలు అదుపు చేసేంత వరకు వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు బోడంకి చందు, ఉమారాణి, నాగజ్యోతి, సిడం సమ్మక్క, నగేష్, చంద్రన్న, మధూకర్, బోగె సత్యం, యామిని, సమత, రాజన్న, బాణయ్య, తిరుమల్, దామోదర్ పాల్గొన్నారు.

కోతల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-జన్నారం

కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కవ్వాల్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కవ్వాల్ గ్రామానికి చెందిన పోడేటి పోచగౌడ్ ఆదివారం ఇంటి వద్ద పనులు చేస్తుండగా కోతుల గుంపు వచ్చి అతనిపై దాడి చేశాయి. ఈ దాడిలో అతని చేతులు కాళ్లు తలపై కోతులు కొరకడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వారి కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం జన్నారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో మెరుగైన చికిత్స కోసం అతనిని మంచిర్యాల ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కవ్వాల్ గ్రామంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉందని అటవీ అధికారులు స్పందించి వెంటనే కోతులను నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బీసీల ఆరాధ్యుడు బీపీ మండల్



నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలో బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బీపీ మండల్ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. బీపీ మండల్ చేసిన కృషి ఫలితంతో బీసీలకు సామాజిక న్యాయం జరిగిందన్నారు. బీసీ మండల్ వల్లే బీసీలకు ప్రాతిపాదిక లభించిందన్నారు. బీపీ మండల్ కృషి వల్లే బీసీల రిజర్వేషన్లు దేశవ్యాప్తంగా ప్రారంభమయ్యాయని తెలుపుతూ ఆయన సేవలు కొనియాడారు. దేశంలోని సగం జనాభ బతుకులు మెరుగు పడేలా కృషి చేశారన్నారు. అందుకే ఆయనను బీసీల ఆరాధ్యుడిగా పిలుస్తుంటారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు వడ్డేపల్లి మనోహర్, బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షులు, బీసీ సీనియర్ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, కర్రే లచ్చన్న, అక్కల రమేష్, శాఖపూరి భీంసేన్, గుంటుక సోమన్న, వైద్య భాస్కర్, బుద్ధి రాజేందర్, చంద్రగిరి చంద్రమౌళి, బండ సతీష్, వేముల మల్లేష్, పెద్దల చంద్రకాంత్, ఎండీ షరీఫ్, జంగంపల్లి శివ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి కల్పించాలి

- పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

నవతెలంగాణ-మంచిర్యాల

పెండింగ్‌లో ఉన్న సమస్యలపై స్పందించి ఏకీకృత సర్వీసులు రూపొందించి అన్ని రకాల ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించడం, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు విడుదల చేసి, సీపీఎస్‌ను రద్దు చేసి కొత్త పీఆర్‌సీ ప్రకటించాలన్నారు. 317 జీఓ ద్వార నష్టపోయిన ఉపాధ్యాయుల సమస్య పరిష్కరించాలని, 13 జిల్లాల భార్యాభర్తల బదిలీల సమస్యను పరిశీలించాలన్నారు. మోడల్ స్కూల్‌లో పనిచేసే ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని, కేజీబీవీలలో పనిచేసే బోధన బోధనేతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ కల్పించాలన్నారు. సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేసే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కూడా మినిమం టైమ్ స్కేల్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధరణికోట వేణుగోపాల్, సూరినేని గంగాధర్, రాష్ట్ర అసోసియేటర్ అధ్యక్షులు సంగర్స్ రవికాంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కమటం రామకృష్ణ లక్ష్మీనారాయణ, సుధీర్ రావ్, మీడియా సెల్ కన్వీనర్ అడిచర్ల సాగర్, జిల్లా ఉపాధ్యక్షులు జి.రామ్మోహన్ రావు, చెన్నూరు మండల అధ్యక్షులు నారంభట్ల సంపత్ కుమార్, నస్పూర్, మందమర్రి మండల ప్రధాన కార్యదర్శులు సూర్నేని రవి, శివార్ల రాజేశం, నాయకులు కస్తూరి శ్రీధర్, సత్యేంద్ర కుమార్ పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-తాండూర్

తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన పసులోటి మీనా శనివారం సాయంత్రం విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో కమన్‌పూర్ మండలం గుండారంకు చెందిన నరేష్‌తో మీనాకు 2016లో ప్రేమ వివాహం జరిగింది. మీనా నరేష్ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. కొన్ని సంవత్సరాలుగా భార్య భర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో మీనా తల్లిగారి ఉరు తంగళ్ళ పల్లిలో ఉంటుంది. భర్తతోపాటు పిల్లలు గుండారంలో ఉంటున్నారు. మీనా ఒంటరితనం భరించలేక మనస్తాపం చెంది విషపూరితమైన లేపనం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి తల్లి కమల దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విష్ణువర్ధన్‌కు ఎడ్యుకేషన్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు



నవతెలంగాణ-మంచిర్యాల

ముప్పై సంవత్సరాలుగా జిల్లాలో వేలకుపైగా విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చి, జిల్లాలో ఉన్నా ప్రయివేట్ ఉపాధ్యాయులకు, పాఠశాలల యాజమాన్యలకు నిరంతర సేవలను అందిస్తూ విద్యారంగ అభివృద్ధికి చేసిన కృషి చేసిన రివిలేషన్ స్కూల్ నిర్వాహకులు రాపోలు విష్ణువర్ధన్ ఎడ్యుకేషన్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్-2024 అవార్డు వరించింది. యూనివర్సల్ మెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ది పార్క్ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఈ అవార్డును ఆయన అందుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఈ గుర్తింపు మా విద్యార్థులు, ఉత్తమ విద్యను అందించడానికి చేసిన సమిష్టి కృషికి ప్రతిబింబమన్నారు. విద్యలో ఆవిష్కరణలకు నిరంతరం ప్రోత్సాహకుడినై భారతదేశంలోని ఉత్తమ విద్యా పద్ధతులను నేర్చుకోవడానికి ఢిల్లీ సహా అనేక ప్రదేశాలను సందర్శించానని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రముఖ విద్యావేత్తలతో ఉన్న పరిచయం, నిరంతరం నేర్చుకోవాలనే తపన, పట్టుదల రివిలేషన్ పాఠశాలలో అత్యాధునిక బోధనా పద్ధతులను అమలు చేయడానికి ప్రేరేపించిందన్నారు. రాబోయే రోజుల్లో మంచిర్యాలను ఉన్నత స్థాయి విద్యా కేంద్రంగా మార్చడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ శేఖర్ జైన్, ఓమ్ టెక్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు, యూనివర్సల్ మెంటర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు సందీప్ గులాటి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్ పాల్గొన్నారు.